క్లుప్తంగా

కుంతీదేవి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఎస్సీ పేటలో ఉన్న కుంతీదేవి అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, పెంకే గోవిందు, బోడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం


పల్లకడియం బాబా ఆలయంలో మధ్యాహ్న హారతిలో పాల్గొన్న భక్తులు

రాజానగరం: పల్లకడియంలోని షిరిడీ సాయి బాబా మందిర 22వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. బాబా మూలవిరాట్‌కి భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయి నామ సంకీర్తనతో మందిర పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనకు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

28న రాజానగరంలో వేడుకలు

రాజానగరంలోని షిరిడీ సాయిబాబా మందిర 21వ వార్షికోత్సవం ఈ నెల 28న జరగనుంది. ఆరోజు వేకువజామున 5.15 గంటలకు ఇచ్చే కాకడ హారతితో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి అఖండ బిల్వార్చన ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నసమారాధన జరుగుతుంది.

కొనసాగుతున్న శిక్షణ

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రత్యేక శిక్షణలో బుధవారం విద్యార్థులకు బేసిక్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 25వ తేదీ వరకూ జరిగే ఈ సమ్మర్ బూట్ క్యాంపులో 6 నుంచి 9వ తరగతికి చెందిన 25 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు రోజులుగా నేర్చుకున్న విషయాలపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు.

ఎండలో బండి జాగ్రత్త

- ట్యాంక్ నిండా పెట్రోల్ నింపితే పేలిపోయే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించకపోతే అంతే సంగతులు


ఎండలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

రంగంపేట: భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సూర్యుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఇక మిట్ట మధ్యాహ్నం వేళయితే చెప్పాల్సిన పని లేదు. ఎండలో కాలు పెడితే చాలు ఒంట్లోని సత్తువంతా ఆవిరైపోతుంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం మనం ఎలా జాగ్రత్తలు పాటిస్తామో వాహనాలను కూడా అలాగే కాపాడుకోవాల్సిన అవసరముంది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకూ నమోదవుతున్న ప్రస్తుత తరుణంలో ట్యాంక్ నిండా పెట్రోల్ నింపేసిన ద్విచక్రవాహనాల్ని ఎండలో వదిలేస్తే ఒక్కోసారి పేలిపోయే ప్రమాదం సైతం ఉందని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. వేసవిలో తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాలకు లోనుకాకుండా చూసుకోవచ్చంటున్నారు.

నిపుణుల సూచనలివీ...

వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్ల నీడలో లేదా షెడ్లలో గాని కవర్లు కప్పి ఉంచాలి. బైక్‌లు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరైపోయే అవకాశం సైతం ఉంటుంది. పెట్రోల్ ట్యాంక్‌పై మందపాటి కవరు ఉండేటట్లు చూసుకోవడం వల్ల కొంత మేర పెట్రోలు ఆవిరి కాకుండా చూసుకోవచ్చు. ఎండల వేడికి ఇంజిన్ ఆయిల్ త్వరగా పలచబడుతుంది కనుక నిర్ణీత సమయానికి ఇంజిన్ ఆయిల్ మార్చుకోవడం మంచిది. వేసవిలో దూర ప్రయాణాల వల్ల వాహనాల వేగానికి, ఉష్ణోగ్రతల వేడికి ఇంజన్ రెండింతలు వేడెక్కే అవకాశం ఉంటుంది. ఇందుకోసం కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపుకుంటే వాహనం మన్నిక కాలం పెరుగుతుంది. వేసవిలో ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణాలు తగ్గించుకుంటే మేలు. కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్ల నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది. పెట్రోలు, డీజిల్‌తో పాటు ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా వాహనాలు నడిపే వారు వేసవిలో గ్యాస్ కిట్ ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.

ఫుల్ ట్యాంక్ చేయించకూడదు



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్ ఎండలో పెట్టాల్సిన అవసరం ఏర్పడితే ఏదైనా పొడవాటి క్లాత్‌ను కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండలకు ఆయిల్ ట్యాంక్ హీటెక్కి పేలిపోయే ప్రమాదం ఉంది. ప్రధానంగా బైక్‌లకు పెట్రోల్ ఫుల్‌ట్యాంక్ చేయించకూడదు.
– గుత్తుల శ్రీను, బైక్ మెకానిక్, రంగంపేట

జననేతకు ఘన స్వాగతం


ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ప్రారంభోత్సవానికి బుధవారం కొవ్వూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు.

జగనన్నకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


తుమ్మలపల్లిలో గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఇలపల్లి పాకలు, తుమ్మలపల్లిల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లి, ఇలపల్లిపాకల్లో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పార్టీలు చూడకుండా పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ జగనన్న పాలనకు, గత చంద్రబాబు దుర్మార్గపు పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్న మీద ఎంత విష ప్రచారం చేసినా, ఎన్ని కూటములు కట్టినా వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. పేదల పక్షాన నిలిచిన నాయకుడు జగనన్నతోనే ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లొల్ల భద్రం, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సాధనాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానికి నోటీసులు

రంగంపేట: ఎటువంటి అనుమతులు తీసుకోకుండా మట్టి తరలించి భూమిని మెరక చేస్తున్న కారణంగా జరిమానా చెల్లించాలంటూ జి.మామిడాడకు చెందిన టిల్లపూడి కృష్ణకుమారికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. రెవెన్యూ వర్గాల సమాచారం ప్రకారం కృష్ణకుమారికి రంగంపేట మండలంలోని సింగంపల్లిలో సర్వే నంబర్ 173/3లో 0.78 సెంట్లు విస్తీర్ణం గల భూమి ఉంది. స్థానిక వీఆర్వో రుద్రమూర్తి సహకారంతో సదరు భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా మెరక చేస్తున్నారంటూ విమర్శలు వినిపించాయి. దీంతో తహసీల్దార్ అమ్మాజీ సదరు ఘటనపై విచారణ చేయించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.46,800తో పాటు మరో రూ.46,800 జరిమానా కలిపి మొత్తం రూ.93,600 చలానా కట్టాలని భూమి గల ఆసామికి నోటీసులు జారీ చేశారు. ఇదే విషయంలో వీఆర్వో రుద్రమూర్తికి తహసీల్దార్ అమ్మాజీ మెమో ఇచ్చినట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 9 మంది గైర్హాజరు

రంగంపేట: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పేపర్ –1, పేపర్–2 పరీక్షలు నిర్వహించారు. ప్రథమ సంవత్సరం పరీక్షకు 91 మంది విద్యార్థులకు గాను 86 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 17 మందికి గాను 13 మంది హాజరయ్యారన్నారు. 9 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్‌ఏ శిరీషలు తెలిపారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం రాజ రాజేశ్వరీ దేవి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. పూజలనంతరం తీర్థప్రసాదాల వితరణ జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ నీరుకొండ వీరన్న చౌదరి తెలిపారు.

పేదలంటే చంద్రబాబుకు చిన్నచూపు


సింగంపల్లిలో చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రంగంపేట: పేదలంటే చంద్రబాబుకు చిన్నచూపని, అభివృద్ధిని అడ్డుకోవడమే ఆయన నైజమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని సింగంపల్లిలో ఇటీవల పేదల ఇంటి స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీకి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల కోసం ఊళ్లే నిర్మిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు గూడు కల్పిస్తుంటే చంద్రబాబుకు కడుపు మంట అని, అందుకే ఆయన సమాధులతో పోలుస్తున్నారని మండిపడ్డారు. అనంతరం చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ చంద్రబాబు దిష్టబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల సమావేశం

గోకవరం: స్థానిక లారీ యూనియన్ హాల్‌లో బుధవారం సీపీఐ మండల సమావేశం నిర్వహించారు. కె.జ్యోతీరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు హాజరై మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పడినా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదన్నారు. పలు పార్టీల ప్రజాప్రతినిధులు అనేక సమస్యలపై ప్రభుత్వానికి తెలిపినా న్యాయం జరగలేదన్నారు. అనేక సార్లు ముఖ్యమంత్రి జిల్లాకు వచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు. జె.వినయ్, కృష్ణ, సుమ ఇందిరా తదితరులు ఉన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: చినకొండేపూడిలోని వేదాస్ ఆసుపత్రిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి, మద్దుకూరి వరలక్ష్మిపై దాడి చేశారన్న ఆసుపత్రి సమాచారం మేరకు ఘంటా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఘంటా శ్రీనివాస్‌తో పాటు మరికొందరు వేదాస్ ఆసుపత్రిలోకి అక్రమంగా ప్రవేశించి వరలక్ష్మిని జుత్తు పట్టుకుని లాగి, చేతులతో కొట్టి, కాళ్లతో తన్ని, గాజుపెంకులతో దాడి చేశారన్నారు.

శ్రీనివాస్ ఫిర్యాదుపై..

సీతానగరం: చినకొండేపూడికి చెందిన ఘంటా శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్దుకూరి వరలక్ష్మిపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు బుధవారం తెలిపారు. ఆమె 15 నెలలుగా ఆసుపత్రి భవనం అద్దె చెల్లించాల్సి ఉందని, అద్దె డబ్బులు అడిగితే తమపై దాడి చేసి, చేయి కోసుకుని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

రంగంపేట: వివాహితను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట గ్రామానికి చెందిన సరికొండ సావిత్రిని ఆమె మరిది గుర్రయ్య కుమారుడైన రవికుమార్ పాత గొడవల కారణంగా గునపంతో ఇంట్లోకి ప్రవేశించి చంపేస్తానంటూ బెదిరించాడు. సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

పెదపూడి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ సారథులు వలంటీర్లు అని ఎంపీపీ కేతా తులసి అన్నారు. దోమాడ, కరకుదురు, ఏపీత్రయం, రామేశ్వరం గ్రామాల్లో సర్పంచులు మీనవల్లి శారదదేవి, వుంద్రు చంద్రకళ, అడబాల అనురాధ, కొటికలపూడి చినబాబు అధ్యక్షతన వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా తులసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్నెడ్ల వెంకన్నబాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ గుండా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో దుప్పలపూడి సర్పంచ్ నల్లమిల్లి సావిత్రి

వలంటీర్లు నిస్వార్థ సేవకులు

అనపర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల ముంగిటకు చేర్చడంలో వలంటీర్లు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని కొప్పవరం సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దుప్పలపూడి, కొప్పవరం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు నల్లమిల్లి సావిత్రి అబ్బన్నరెడ్డి, బుల్లిమోహన్‌రెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కొప్పవరం మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, ఉపసర్పంచ్ వీర్రాఘవరెడ్డి, కొప్పవరం పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరకుదురులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ తులసి తదితరులు

కోర్టు అనుమతితో కేసు నమోదు

రంగంపేట: పొలం సరిహద్దు, రివాజు దారి విషయమై తగాదాపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట గ్రామానికి చెందిన పుట్టా వీరయ్యమ్మకు స్థానిక పద్దరాజు చెరువు వద్ద 90 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఆయన భూమికి సరిహద్దులో ఉన్న ఇతరుల భూమిని అదే గ్రామానికి చెందిన పోతుల తాతారావు, పోతుల పద్మారావు, పోతుల సూర్యనారాయణలు కౌలు చేస్తున్నారు. అయితే సరిహద్దు, దారి విషయంలో కౌలుదారులకు, వీరయ్యమ్మకు 2015 ఆగస్టు 25న గొడవ జరిగిందని అప్పుడు పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని సాక్ష్యాలు లేనందున ఫాల్స్ కేసుగా పరిగణించి క్లోజ్ చేశారన్నారు. 2022 జులై 17న వీరయ్యమ్మ తన పొలం గట్లను నరికి కంచె వేశారని, అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇది సివిల్ తగాదాకు సంబంధించినది కనుక కోర్టుకు నివేదిక పంపించి కేసు నమోదుకు అనుమతి కోరామన్నారు. కోర్టు నుంచి అనుమతి రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు వేసవి శిబిరం


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

రాజానగరం: సంపత్ నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు బుధవారం సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరానికి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, వెస్ట్రన్ డ్యాన్స్, మ్యూజిక్, హార్స్ రైడింగ్, రైఫిల్ షూటింగ్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్, కరాటే, కిక్ బాక్సింగ్, ఆర్చరీల్లో శిక్షణ పొందారు. హాజరైన విద్యార్థులందరికీ నిర్వాహకులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

చలివేంద్రం ప్రారంభం


రామేశ్వరంలో చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ చినబాబు

పెదపూడి: మండలంలోని రామేశ్వరం మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, కె.గోపి, దూళ్ల వీరబాబు, కొటికలపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో గోల్డ్ మెడల్


సునీతను అభినందిస్తున్న రెడ్డి సురేష్‌శర్మ

అనపర్తి: మైసూర్ అవధూత దత్త పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే భగవద్గీత ఆరు నెలల ఆన్‌లైన్ క్లాసుల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని కొప్పవరం గ్రామానికి చెందిన సత్తి సునీత శ్రీనివాసరెడ్డి గోల్డ్ మెడల్‌కు ఎంపికైనట్లు స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు రెడ్డి సురేష్‌శర్మ తెలిపారు. జూన్ 4న మైసూర్ దత్త పీఠంలో పీఠాధిపతులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ఆమె గోల్డ్ మెడల్ అందుకోనుందని సురేష్ తెలిపారు. గోల్డ్‌మెడల్‌కు ఎంపికైన సునీతను బుధవారం స్థానిక సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు అభినందించారు.